పైసలిస్తేనే.. పనులు!

జీడిమెట్ల డివిజన్ పరిధిలో విద్యుత్ అధికారులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. 'పని కావాలంటే.. పైసలు ముట్టాల్సిందే' లేదంటే ఫైల్ ముందుకు కదలదు. ప్యానెల్ బోర్డుల బిగింపు మొదలుకొని మీటర్ల ఏర్పాటు వరకు అన్నితామై బినామీల అవతారం ఎత్తుతున్నారు. దీంతో ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి పడుతోంది. నూతన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు విషయంలో వీరు వ్యవహరిస్తున్న తీరుపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. డీఈ, ఏడీఈ, ఏఈ స్థాయి అధికారులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తూ లక్షలు జేబుల్లో వేసుకుంటున్నారన్న ప్రధాన ఆరోపణలు వినిపిస్తున్నాయి. గురువారం ఏసీబీ అధికారులకు పట్టుబడ్డ సురేందర్ రెడ్డి వ్యవహారం కూడా ఆది నుంచి వివాదాస్పదమే అని తెలుస్తోంది. – కుత్బుల్లాపూర్

- ఇష్టానుసారంగా విద్యుత్ అధికారుల తీరు
- ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి
- ఇటీవలే ఏసీబీకి పట్టుబడ్డ ఏఈ



ట్రాన్స్‌ఫార్మర్ల కెపాసిటీని బట్టి రేటు

జీడిమెట్ల డివిజన్ పరిధిలోని విద్యుత్ అధికారుల తీరు సప'రేట్' గా మారుతుంది. షాపూర్ నగర్ ఏడీఈ పరిధిలో డి పోచంపల్లి, జీడిమెట్ల ఏడీఈ పరిధిలో ప్రగతి నగర్, భౌరంపేట్ రెండు సెక్షన్లు ఉన్నాయి. ఇక్కడ పారిశ్రామిక ప్రాంతాలు ఎక్కువగా ఉండటంతో విద్యుత్ అధికారులు ఆడిందే ఆట.. పాడిందే పాట అన్న చందంగా మారింది. ఇక్కడ ఎవరైనా కొత్త నిర్మాణాలు చేపట్టినా, పరిశ్రమ ఏర్పాటు చేసినా వీరి పంట పండినట్లే. 20 కిలో వాట్స్ కంటే ఎక్కువగా ఉన్న ప్రాంతాలపై వీరు దృష్టి సారించి వాటి అంచనాలకు సరి సమానంగా లంచాలు తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. ఉదాహరణకు 63 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు కావాలంటే సుమారు రెండున్నర లక్షలు ఖర్చవుతుంది.. కానీ ఇక్కడ ఏడీఈ స్థాయి అధికారులు మొదలుకొని ఏఈ, డీఈ, లైన్‌మెన్‌ల వరకు లంచాలు ఇవ్వనిదే ఫైలు కదలదని తెలుస్తోంది. 100 కేవీ, 250 కేవీ, 315 కేవీ, 500 కేవీ ట్రాన్స్‌ఫార్మర్లు కావాలంటే అంచనాలతో పాటు అధికారులకు సైతం రూ.50 వేల చొప్పున 3 లక్షలు చెల్లించాల్సిందే. లేనిపక్షంలో వివిధ కారణాలతో ఫైల్ రిజెక్ట్ చేసి హోల్డ్‌లో ఉంచడం పరిపాటిగా మారింది. ఇలా కొంతమంది చేతులు తడిపి ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసుకోవాల్సిన పరిస్థితి ఉందని పలువురు వాపోతున్నారు. డి.పోచంపల్లి ఏఈ సురేందర్ రెడ్డిపై ఎన్నో ఆరోపణలు వచ్చినప్పటికీ ఏ ఒక్క అధికారి అతనిపై చర్యలు తీసుకోలేదు. అవినీతి వెనుక ఉన్నతాధికారుల హస్తం ఉందన్న ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. కాంట్రాక్టర్ ఏసీబీ అధికారులను ఆశ్రయించి అతని ఆట కట్టించడంతో ఇప్పుడు అధికారులు డైలమాలో పడ్డారు.

పారదర్శకంగానే పనులు

ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు తదితర విషయాల్లో పారదర్శకంగా ముందుకు సాగుతున్నాం. కాంట్రాక్టర్లకు బిల్లుల చెల్లింపులో కూడా అవినీతికి తావులేదు. పనుల కోసం అధికారులు, సిబ్బంది డబ్బులు అడిగితే సమాచారం ఇవ్వాలి. కొంతమంది సిబ్బంది పనితీరు వల్ల సమస్యలు ఎదురవుతున్నాయి. వారిపై విజిలెన్స్ విచారణ జరుగుతుంది.

– వీరేశం, షాపూర్‌నగర్ ఏడీఈ

విజిలెన్స్.. సైలెన్స్?

జీడిమెట్ల విద్యుత్ డివిజన్ పరిధిలోని విచ్చలవిడిగా అక్రమ ట్రాన్స్‌ఫార్మర్లతోపాటు ప్యానెల్ బోర్డులో ఏర్పాటు మీటర్ల కేటాయింపులు జరుగుతున్నాయి. ఈ క్రమంలో క్షేత్రస్థాయిలో పర్యటించి వాటి వివరాలను సేకరించాల్సిన విజిలెన్స్ అధికారులు అది తమ పరిధి కాదు అన్నట్లుగా వ్యవహరించడం అధికారులకు అవకాశంగా మారుతుంది. ఇప్పటి వరకు ఈ డివిజన్ పరిధిలో అనేక అక్రమ కనెక్షన్లు ఏర్పాటు చేసినా విజిలెన్స్ అధికారులకు వీరి అక్రమాలు కనిపించకపోవడం వెనుక ఆంతర్యం ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. అధికారులు, సిబ్బంది అక్రమాలకు పాల్పడితే వారిపై నిఘా పెట్టి విజిలెన్స్ విచారణ ద్వారా వారిపై చర్యలు తీసుకోవచ్చు. కానీ ఇప్పటివరకు ఇటువంటి దాఖలాలు లేకపోవడం విశేషం. ఇప్పటికైనా అధికారుల తీరు మారుతుందో? లేదో? చూడాలి.

నేడు 'సాక్షి' ఆధ్వర్యంలో పంచాంగ శ్రవణం

నిజాంపేట్ : శ్రీ విశ్వావసు నామ సంవత్సర ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రముఖ మీడియా సంస్థ సాక్షి ఆధ్వర్యంలో ఆదివారం ఉగాది సంబురాలు ఘనంగా నిర్వహించనున్నారు. బాచుపల్లి, క్రాంతి నగర్ కాలనీ శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో సాయంత్రం 6 గంటలకు ఉగాది పంచాంగ శ్రవణం గావిస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ కాంతారావు తెలిపారు. కార్యక్రమానికి ప్రముఖ సంస్థ భారతీ సిమెంట్స్ స్పాన్సర్‌గా వ్యవహరిస్తోందన్నారు. సిద్ధాంతి చక్రవర్తులు శ్రీవత్స్యాచార్యులచే పంచాంగ శ్రవణం, ఆధ్యాత్మిక ప్రసంగాలు, ప్రఖ్యాత నర్తకి యామిని రెడ్డి బృందం కళాత్మక కూచిపూడి నృత్యం ఉంటుందని తెలిపారు.

కాంగ్రెస్ విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

నియోజకవర్గ ఇన్‌చార్జి కొలన్ హన్మంతరెడ్డి

కుత్బుల్లాపూర్: కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలను కార్యకర్తలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కొలన్ హన్మంతరెడ్డి అన్నారు. శనివారం జై బాపు.. జై భీమ్.. జై సంవిధాన్ కార్యక్రమం జీడిమెట్ల డివిజన్ అధ్యక్షుడు బేకు శ్రీనివాస్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భారత రాజ్యాంగాన్ని మార్చేందుకు కొన్ని శక్తులు యత్నిస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతిరెడ్డి, బొంగునూరి శ్రీనివాస్‌రెడ్డి, ఆర్ లక్ష్మి, దమ్మని శ్రవణ్ కుమార్, కుత్బుల్లాపూర్ బ్లాక్ అధ్యక్షుడు బండి శ్రీనివాస్‌గౌడ్, గొరిగె బాలప్ప, మహిళా అధ్యక్షురాళ్లు సుజాత, సుజాత యాదవ్, పుల్లం రాజు, ఎస్.సంజీవరెడ్డి, అవిజె జేమ్స్, జాకీర్ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ సిబ్బందికి ఉగాది కానుకలు

నిజాంపేట్ : ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని బీజేపీ, బీజేవైఎం ఆధ్వర్యంలో బాచుపల్లి 21వ డివిజన్ మున్సిపల్ సిబ్బందికి శనివారం ఉగాది కానుకలు పంపిణీ చేశారు. పారిశుద్ధ్య కార్మికులను సన్మానించారు. స్వీట్లు, దుస్తులు అందజేశారు. అనంతరం బీజేపీ బాచుపల్లి అధ్యక్షులు ఎన్.ప్రసాద్ రాజు మాట్లాడుతూ.. మున్సిపల్ కార్మికుల సేవలు వెలకట్టలేనివన్నారు. అనంతరం ఉగాది శుభాకాంక్షలు తెలిపారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన

జగద్గిరిగుట్ట: చింతల్, పద్మా నగర్ కాలనీ ఫేజ్ 1 లోని వెల్ఫేర్ సొసైటీ ఆఫీసు వద్ద శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. అపోలో డయాగ్నొస్టిక్స్ ఆధ్వర్యంలో మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహించిన శిబిరానికి విశేష స్పందన లభించింది. ఉచితంగా మందులను అందజేశారు.

ఘనంగా బ్రైట్‌విల్లే స్కూల్ వార్షికోత్సవం





విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శన

కుత్బుల్లాపూర్: గాజులరామారం మహదేవపురంలోని బ్రైట్‌విల్లే స్కూల్ మొదటి వార్షిక వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను అలరించాయి. అనంతరం విద్యతో పాటు ఆటల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు పాఠశాల యాజమాన్యం సర్టిఫికెట్లతో పాటు మెమొంటోలు అందజేసింది.



బీజేపీ కొంపల్లి మున్సిపల్ అధ్యక్షుడు పెద్దబుద్దుల సతీష్‌సాగర్, సంకల్ప్ ఫౌండేషన్ సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికలకు టోపీలు అందజేశారు.

– కుత్బుల్లాపూర్

పాఠశాలలో ఉగాది, రంజాన్ వేడుకలు

కుత్బుల్లాపూర్: చింతల్, వేంకటేశ్వర నగర్‌లోని బచ్‌పన్ ప్లే స్కూల్ లో ఉగాది, రంజాన్ వేడుకలను శనివారం నిర్వహించారు. డైరెక్టర్ పూర్ణిమ ప్రీ ప్రైమరీ చిన్నారులతో కలిసి షడ్రుచులతో కూడిన ఉగాది పచ్చడిని తయారి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అనంతరం రంజాన్ పురస్కరించుకుని చిన్నారులు నమాజ్ చేసి ఒకరికొకరు షీర్ ఖుర్మా తినిపించుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు.



ఉగాది వేడుకలో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు